నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 20 మార్చి 2024 | NIZAMABAD

రంజాన్ వేళలు
బుధవారం
ఇఫ్తార్ - 6:35
గురువారం
సహర్ - 5:10

రైతులతో మాట్లాడుతున్న అధికారులు

రైతు గోస పట్టదా..

రోడ్డెక్కిన అన్నదాత

- జాతీయ రహదారి దిగ్బంధం
- పంట నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్
- రెండుగంటల పాటు రాస్తారోకో..ట్రాఫిక్‌జామ్

కామారెడ్డి జిల్లా అంతంపల్లి శివారులో జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

నేషనల్ హైవేపై నిలిచిన వాహనాలు

భిక్కనూరు, మార్చి 19 : వడగండ్లు పడి నాలుగు రోజులు గడిచినా పంటనష్టం అంచనా వేసేందుకు అధికారులు రాకపోవడంతో రైతులు మండిపడ్డారు. లక్షలు పెట్టుబడి పెట్టిన పంట అకాల వర్షంతో దెబ్బతింటే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే నష్టం అంచనా ఎలా వేశారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిని దిగ్బంధించారు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం అంతపల్లి శివారులోని హైవేపై అంతపల్లి, రామేశ్వర్‌పల్లి, లక్ష్మీదేవునిపల్లి, తిప్పాపూర్, జంగంపల్లి, తలమడ్ల గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. రెండు గంటలపాటు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించడంతో ఇరువైపులా నాలుగు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పలువురు రైతులు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానతో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, వరి, మక్కజొన్న, బొప్పాయితోపాటు కూరగాయలు సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తంచేశారు. అకాలవర్షం కురిసిన నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు అధికారులు గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేయలేదని, రైతులంటే అంత చులకనా అంటూ దెబ్బతిన్న పంటలను చూపిస్తూ మండిపడ్డారు. రైతులంటే చిన్నచూపా.. మా గోస మీకెలా అర్థమవుతుందన్నారు. పంటల సాగుకోసం పెట్టిన పెట్టుబడులతోపాటు చేసిన కష్టం వృథా అయి రోడ్డునపడ్డామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం పంట నష్ట పరిహారం ప్రకటించే వరకు ఇక్కడినుంచి కదిలేది లేదని బీష్మించుకూర్చున్నారు.

విషయం తెలుసుకొని జిల్లా వ్యవసాయ శాఖ ఏడీఏ అపర్ణ, ఏవో రాధారెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, భిక్కనూరు సీఐ సంపత్ కుమార్, ఎస్సై సాయికుమార్ ఘటనాస్థలానికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. పంట నష్టం నివేదికను ప్రభుత్వానికి పంపించామని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తెలుపగా.. పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా నష్టాన్ని ఎలా అంచనా వేస్తారని బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో ముందస్తు జాగ్రత్తగా జాతీయ రహదారిపై పోలీసు బలగాలను మోహరించారు. అనంతరం డీఎస్పీ నాగేశ్వర్ రావు రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ రేపటి వరకు నష్టపరిహారం ప్రకటించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి బాధిత రైతులతో మాట్లాడి వ్యవసాయాధికారులను గ్రామాలకు పంపించి నష్టం వివరాలను సేకరిస్తామని, కలెక్టర్‌తో సంప్రదించి ప్రభుత్వానికి నివేదిక తయారు చేసి పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పంట నష్టపోయిన రైతుల వివరాలను ఆర్డీవోకు అందజేశారు.

నా పేరు గోపాల్. మాది అంతంపల్లి. నేను మూడు ఎకరాల్లో వరి, రెండు ఎకరాల్లో మక్కజొన్న సాగు చేసిన. నాలుగు రోజుల కిందట వడగండ్ల వాన కురవడంతో పంట పూర్తిగా దెబ్బతిన్నది. చేతికొచ్చే సమయంలో అకాల వర్షం నట్టేట ముంచింది. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

నా పేరు రాములు. మాది అంతంపల్లి. ఐదు ఎకరాల్లో వరి, నాలుగు ఎకరాల్లో మక్కజొన్న పంట వేసిన. వడగండ్ల వానతో చేతికి వచ్చిన పంట నేలకొరిగింది. పంటలు దెబ్బతిని నాలుగు రోజులు గడుస్తున్నా ఏ అధికారీ మమ్మల్ని పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల గోసను పట్టించుకొని నష్టపరిహారం అందించాలి.

బ్రహ్మోత్సవాలు సంపూర్ణం

బీర్కూర్‌లోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆరు రోజులుగా కొనసాగుతున్న శ్రీలక్ష్మీగోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి నవమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు మంగళవారం సంపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివారికి మహా పూర్ణాహుతి, పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.
–నస్రుల్లాబాద్, మార్చి 19

కలెక్టర్, సీపీ విస్తృత పర్యటన

కమ్మర్‌పల్లి/ ఆర్మూర్‌టౌన్/భీమ్‌గల్, మార్చి 19: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పలుచోట్ల ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ మంగళవారం పరిశీలించారు. మొదట ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గత అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన తహసీల్ కార్యాలయం ఎదుట ఉన్న ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. తక్కువ పోలింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెర్కిట్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. జిల్లా సరిహద్దులోని కమ్మర్‌పల్లిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు, భీమ్‌గల్‌లో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. వారి వెంట అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ బస్వారెడ్డి ఉన్నారు.

కమ్మర్‌పల్లిలో చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ , సీపీ

పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే

డిచ్‌పల్లి/ ఇందల్వాయి, మార్చి 19 : నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే భూపతిరెడ్డి మంగళవారం పరిశీలించారు. డిచ్‌పల్లి మండలం సుద్దులం, కోరట్‌పల్లి, ఇందల్వాయి మండలం నల్లవెల్లి, గన్నారం, స్టేషన్ తండా, సిర్నాపల్లి గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వంతో మాట్లాడి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ముప్పా గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, మండల అధ్యక్షులు నవీన్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సుద్దులంలో పంటను పరిశీలిస్తున్న రూరల్ ఎమ్మెల్యే

అగ్గిరాజేసిన హస్తం పదవులు

- ఒకే నియోజకవర్గానికి మూడు పదవులతో నేతల అసంతృప్తి
- ఎందరో ఆశావహులు.. కొందరికే పదవులు
- గుర్తింపు కరువై రగిలిపోతున్న లీడర్లు
- కేబినెట్ బెర్త్ కోసం సుదర్శన్ రెడ్డి పడిగాపులు
- బాన్సువాడలో బాలరాజుకు పదవితో 'ఏనుగు'కు చెక్

నిజామాబాద్, మార్చి 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు అమాత్యయోగమే దక్కకుండా పోయింది. డిసెంబర్ 7న ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం ఆ తర్వాత మంత్రివర్గ కూర్పు చకచకా జరిగినప్పటికీ ఇంతవరకు ఉభయ జిల్లాలకు చెందిన నేతలకు ఎవరికీ చోటే లేకుండా పోయింది. మంత్రివర్గ విస్తరణ రేపు, మాపు అంటూ సాగదీస్తున్నది. మంత్రి పదవి పక్కన పెడితే వివిధ కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకాల ప్రక్రియలో మాత్రం పెద్దపీట దక్కింది. మొదటగా షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారుగా, ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా తాహెర్‌బిన్ హందాన్‌ను ప్రభుత్వం నియమించింది. ఆ తర్వాత మరో నలుగురికి మూడు రోజుల క్రితం వివిధ ప్రభుత్వరంగ సంస్థలకు చైర్మన్ల నియామకం జరిగింది. అందులో ముగ్గురు నేతలూ బాల్కొండ నియోజకవర్గానికి చెందిన వారు కావడంతో కాంగ్రెస్ పార్టీలో ప్రచ్ఛన్న యుద్ధం మొదలైంది.

బాన్సువాడలో 'ఏనుగు'కు చెక్...

అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ నుంచి హస్తం గూటికి చేరిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డికి ప్రస్తుత పదవుల భర్తీ ఇబ్బందికరంగా మారే అవకాశం ఏర్పడింది. కాంగ్రెస్ తరపున బాన్సువాడ నుంచి పోటీచేసి ప్రచారం చేతిలో ఘోరంగా ఓటమి చవిచూశారు. ఓడిపోయినా నియోజకవర్గంలో పర్యటిస్తూ హల్‌చల్ చేస్తున్నారు. ఇదే సమయంలో సీనియర్ నేత కాసుల బాలరాజుకు ఆగ్రోస్ చైర్మన్ పదవిని కట్టబెట్టడంతో ఏనుగు రవీందర్ రెడ్డి పరిస్థితిపై నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా తానే వ్యవహరిస్తానంటూ పలు సందర్భాల్లో ఏనుగు రవీందర్‌రెడ్డి శ్రేణులకు చెప్పుకొచ్చారు. కాసుల యాక్టివ్ మోడ్‌లోకి రావడంతో హస్తం క్యాడర్ ఎటువైపు వెళ్లాలో తర్జనభర్జన పడుతున్నది.

మంత్రియోగం ఇప్పట్లో లేనట్లే..

వంద రోజుల పరిపాలనను పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు ఇప్పటికీ మంత్రి యోగమే లేకుండా పోయింది. కేవలం మహబూబ్‌నగర్‌కు చెందిన జూపల్లి కృష్ణారావును ఇన్‌చార్జి మంత్రిగా నియమించి చేతులు దులుపుకోవడంతోనే పరిస్థితి ముగిసినట్లయ్యింది. ఫిబ్రవరిలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, అందులో నిజామాబాద్ జిల్లాకు చెందిన సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి కట్టబెడతారని అంతా ఆశించారు. కానీ అదీ నెరవేరలేదు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో జూన్ 6 వరకు ఈ ప్రభావం ఉండనున్నది. దీంతో ఇప్పట్లో మంత్రి యోగం జిల్లాకు దక్కే అవకాశం లేకుండా పోయింది.

బాల్కొండకు మూడు పదవులు..

బాల్కొండ నియోజకవర్గానికి ఏకంగా ఒకేసారి మూడు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు దక్కినట్లు అయ్యింది. కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, తెలంగాణ మినరల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేశ్ రెడ్డిని నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు జారీచేసింది. వీరు ముగ్గురూ ఒకే నియోజకవర్గం కాగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన సునీల్ రెడ్డితో కలుపుకొని నాయకత్వం నాలుగు భాగాలుగా విభజనకు గురికావడం తథ్యమన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. సునీల్ రెడ్డితో పోలిస్తే పైముగ్గురికి ప్రోటోకాల్ పదవులుండడంతో వారికే ఎక్కువగా ప్రాధాన్యత ఉండబోతున్నట్లుగా తెలుస్తోంది. ఎన్నికల ముందు కాంగ్రెస్‌లోకి వచ్చిన సునీల్ రెడ్డి పరిస్థితి ఏంటన్న చర్చ సర్వత్రా జోరుగా నడుస్తున్నది. మరోవైపు నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో సీనియర్ నేతలెందరో ఉండగా వారికి పదవులే వరించకపోవడంతో స్థానిక నాయకత్వం అసంతృప్తితో రగిలిపోతున్నది.

పన్నుల కోసం అధికారుల నిరసన

కామారెడ్డి, మార్చి 19: పన్ను చెల్లించాలని కోరుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పలు దుకాణాల ఎదుట మున్సిపల్ అధికారులు మంగళవారం నిరసన తెలిపారు. ప్రభుత్వం ఆస్తి పన్నులో 90 శాతం రాయితీ ఇచ్చిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాయితీ పోను మిగిలిన పన్నులను ఈ నెల 31లోపు చెల్లించాలని ఎన్నిసార్లు చెబుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అందుకే షాపుల ఎదుట నిరసన తెలుపుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ రవిగోపాల్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానయ్య, బిల్ కలెక్టర్లు సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలోని ఓ షాపు ఎదుట కూర్చుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ సిబ్బంది